ఆంధ్రజ్యోతి
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.4 కనిష్ఠం 21.1

కామారెడ్డి
జిల్లా వార్తలు
5
గురువారం 21 మార్చి 2024

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద నగదు పట్టివేత

మద్నూర్, మార్చి20: మండలంలోని సలాబత్‌పూర్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద బుధవారం ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న 60వేలను నగదును సీజ్‌చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఎన్నికలకోడ్‌లో భాగంగా అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. హైదరాబాద్ నుంచి మహారాష్ట్ర కారులో వెళ్తున్న పరదేశి ప్రతాప్‌సింగ్ అనే వ్యక్తి రూ.60వేలు తీసుకెళుతుండగా పట్టుబడినట్లు ఎస్సై తెలిపారు. నాందేడ్‌కు చెందిన కాంట్రాక్టర్ హైదరాబాద్ నుంచి డబ్బు తరలిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా తరలిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.


వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాతో సమావేశమైన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు, ఎమ్మెల్యేలు, నాయకులు

హస్తం ఆశలు ఫలించేనా?

- జహీరాబాద్ ఎంపీ స్థానం కోసం కాంగ్రెస్ కసరత్తు
- ఇప్పటికే ఆ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్ ఖరారు
- దృష్టి కేంద్రీకరించిన రాష్ట్రస్థాయి నేతలు, ఎమ్మెల్యేలు
- పార్లమెంట్ పరిధిలో నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- జిల్లా ఎమ్మెల్యేలపైనే ఎంపీ అభ్యర్థి ఆశలు
- గెలుపే లక్ష్యంగా సమన్వయంతో ముందుకు..
- అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా పార్టీ శ్రేణులతో సమావేశాలు
- అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు లోక్‌సభలో పునరావృతమయ్యేనా?

అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన కాంగ్రెస్ పార్లమెంటు ఎన్నికలపై కసరత్తు చేస్తోంది. ఈ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే లోక్‌సభ ఎన్నికల్లోనూ పునరావృతం అవుతాయని ఎంపీ అభ్యర్థులు ఆశలు పెట్టుకుంటున్నారు. జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండేది. గతంలో ఈ ఎంపీ స్థానం కాంగ్రెస్‌దే కాగా, ఈ సెగ్మెంట్ లోని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ మెజార్టీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పాగావేశారు. అలాంటి కంచుకోటఉన్న జహీరాబాద్ ఎంపీ స్థానాన్ని ఈలోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కైవసం చేసుకొని పూర్వవైభవం సాధించేందుకు ఆ పార్టీ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను గెలిపించడమే లక్ష్యంగా కాంగ్రెస్ రాష్ట్రస్థాయి నేతలు దృష్టి కేంద్రీకరించారు. ఈ పార్లమెంటు సెగ్మెంట్‌లోని కాంగ్రెస్ ముఖ్యనేతలు సమన్వయంతో ముందుకుపోతున్నారు. ఇటీవల రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖమంత్రి దామోదర్ రాజనర్సింహా నేతృత్వంలో పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు ముఖ్యనేతలు సమా వేశమై పార్లమెంట్ ఎన్నికలపై సమీక్షించారు. మరోవైపు ఆయా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నియోజకవర్గస్థాయిలో పార్టీ శ్రేణులను ఎన్నికలపై సమయత్తం చేస్తున్నారు. ఈ పార్లమెంటు ఎన్నికలలో ఎలాగైనా అత్యధిక స్థానాలు కైవసం చేసుకోవాలని పట్టుతో కాంగ్రెస్ అధిష్ఠానం పావులు కదుపుతోంది.

● కామారెడ్డి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి)

ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోటగా జహీరాబాద్

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం గతంలో కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండేది. నియోజకవర్గాల పునర్విభజనతో పార్లమెంటు నియోజకవర్గం 2008లో ఏర్పడింది. 2009లో తొలిసారిగా పార్లమెంటు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థి సురేష్ షెట్కార్ విజయం సాధించారు. ఈ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. గతంలో ఈ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థులైన షబ్బీర్ అలీ, గీతారెడ్డి, కృష్ణారెడ్డి, దామోదర్ రాజనర్సింహ, జనార్ధన్‌గౌడ్ ఎమ్మెల్యేగా పనిచేశారు. 2009 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సురేష్ షెట్కార్, టీఆర్ఎస్ అభ్యర్థి సయ్యద్ యుసీఫ్ అలీ పై 17వేల మెజార్టీతో విజయం సాధించారు. ఇలాంటి కాంగ్రెస్‌కు కంచుకోట ఉన్న జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం ఉద్యమ నేపధ్యంలో రాష్ట్రం ఏర్పడిన తర్వాత టీఆర్ఎస్ అభ్యర్థి బీబీపాటిల్ 2014, 2019 ఎన్నికల్లో గెలిచారు. అయితే ప్రస్తుతం రాజకీయ పరిస్థితులు మారాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడం, బీఆర్ఎస్ బలహీనపడడం, బీజేపీకి అంత పట్టులేకపోవడం దీనికితోడు జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండడంతో ఈ ఎన్నికల్లోనైనా పార్లమెంటు నియోజకవర్గంపై మరోసారి కాంగ్రెస్ జెండాను ఎగురవేసేందుకు ఆ పార్టీ దృష్టి పెట్టింది.

దృష్టి కేంద్రీకరించిన రాష్ట్రస్థాయి నేతలు

ఈ లోక్‌సభ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి కీలకం కానున్నాయి. రాష్ట్రంలోని మెజార్టీ ఎంపీ స్థానాలను కైవసం చేసుకునేందుకు ఆ పార్టీ అధిష్ఠానం వ్యూహాత్మకంగా ముందుకుపోతోంది. ప్రతీ ఎంపీ స్థానాన్ని గెలుచుకునేందుకు రాష్ట్రస్థాయి కాంగ్రెస్ నేతలు సైతం దృష్టి కేంద్రీకరించారు. ఇందులో భాగంగా జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలో ఉంది. ఈ రెండు జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేతలు చాలామంది ఉన్నారు. వీరంతా విభేదాలను పక్కనబెట్టి సురేష్‌షెట్కార్ గెలుపు కోసం కృషిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జహీరాబాద్ ఎంపీ స్థానంలో ఎలాగైనా కాంగ్రెస్ జెండాను ఎగురవేసి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు పార్టీలోని సీనియర్ నాయకులు ఐక్యంగా ముందుకు కదలనున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ సీనియర్ నేతలతోపాటు ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతరావు నేతలు ఏనుగు రవీందర్‌రెడ్డి, మరికొందరు ముఖ్యనేతలు సమన్వయంతో ముందుకుపోతూ సురేష్‌షెట్కార్ తరఫున విస్తృతంగా చేపట్టనున్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఎవరికి వారే సమావేశాలు ఏర్పాటు చేస్తూ కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలంటూ ఆ పార్టీ శ్రేణులను సైతం అప్రమత్తం చేస్తున్నారు.

ప్రచారంపై వ్యూహాలు

జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గాన్ని ఎలాగైనా కైవసం చేసుకోవాలనే ఆశతో జిల్లా, రాష్ట్రస్థాయి నేతలు దృష్టి సారించారు. అన్ని పార్టీలకంటే ముందుగానే కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించింది. మొదటి జాబితాలోనే జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా సురేష్ షెట్కార్ ఖరారు చేసింది. అప్పటినుంచి పార్టీ అభ్యర్థి ఎన్నికల ప్రచారంపై ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ సైతం ఎన్నికల కమిషన్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయనుంది. ఇరు జిల్లాలోని కాంగ్రెస్ ముఖ్యనేతలను అభ్యర్థి సురేష్‌షెట్కార్ కలుస్తూ సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు. ప్రచారంపై దృష్టిసారించి ఏడు నియోజకవర్గాల్లో ప్రచార ప్రణాళికలను సిద్ధం చేసుకుంటూ ముందుకు పోతున్నారు. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లోని ఇన్‌చార్జీలతోపాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులతో కలిసి సభలు, సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ శ్రేణులను ఎన్నికలకు సిద్ధం చేస్తున్నారు. అదేవిధంగా కాంగ్రెస్ సీనియర్లు సైతం సురేష్‌షెట్కార్ తరపున ప్రచారం చేసేందుకు సిద్ధమవుతున్నారు.

టీకాయే.. రక్ష!

- జిల్లాలో గాలికుంటు టీకాల పంపిణీ
- 43 బృందాల ఏర్పాటు
- జిల్లాలో మొత్తం 1,56,650 పశువులు
- ఇందులో 70248 తెల్లపశువులు, 86402 గేదెలు



సదాశివనగర్, మార్చి 20: పశువులకు వైరస్ ద్వారా వ్యాపించే గాలికుంటు వ్యాధి నివారణ కోసం జిల్లా పశు సంవర్ధకశాఖ ప్రత్యేక దృష్టిసారించింది. ప్రతీ రెండేళ్లకు పశువులకు టీకాలిచ్చి గాలి కుంటువ్యాధి నివారణకు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా ఉన్న మండలాల పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి పశువులకు ఉచితంగా నివారణ టీకాలు వేస్తున్నారు. మొత్తం 43 బృందాలను ఏర్పాటుచేయగా ఇందులో తాడ్వాయి మండలంలో నాలుగుటీంలు, బిచ్కుందలో మూడు టీంలు, గాంధారిలో మూడుటీంలతోపాటు ఆయా మండలాల్లో అవసరం మేరకు టీంలను ఏర్పాటుచేసి టీకాలు వేస్తున్నారు.

● పశువులపై గాలికుంటు వ్యాధి దాడి

మూగ జీవాలపై పలురకాల వ్యాధులు దాడిచేస్తుంటాయి. ముఖ్యంగా వైరస్ ద్వారా గాలికుంటువ్యాధి ప్రబలుతుంది. పుట్అండ్ మౌత్ డీసీజ్‌గా ఈ వ్యాధిని పేర్కొంటారు. గాలిలో తేమశాతం అధికంగా ఉన్నప్పుడు గాలికుంటు వ్యాధి వ్యాపించే అవకాశం ఉంటుంది. వ్యాధిసోకిన సమయంలో పశువుల్లో గర్భం విఫలమవుతుంది. నోరు, మూతి, కాళ్లు, గిట్టలపై పుండ్లు, బొబ్బలు రావడం, నోటి నుంచి విపరీతంగా నూరుగ రావడం, తీవ్రమైన జ్వరం లాంటి వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. పశువుల అంతస్రావాల వల్ల వ్యాధి మిగితా పశువులకు వ్యాపించే అవకాశం ఉంటుంది. వ్యాధి కారక క్రిమి ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది. గాలిలో తేమశాతం అధికంగా ఉన్నప్పుడు ఒకచోటు నుంచి మరో చోటుకు త్వరగా వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి ఎక్కువగా ఆగస్టు,సెప్టెంబరు, మార్చి, ఏప్రిల్ నెలల్లో సోకుతుంది. ప్రతీఏటా ఈ నెలల్లో వ్యాధి నివారణకు పశు సంవర్ధకశాఖ పశువులకు టీకాలు వేస్తుంది. ఈవ్యాధి సోకిన పశువుల్లో ఉత్పాదకశక్తి తగ్గిపోతుంది. ఫలితంగా పాడిరైతులు ఆర్థికంగా నష్టపోతారు.

● 43 బృందాల నియామకం

పశువులు గాలికుంటు బారిన పడకుండా పశు సంవర్ధరకశాఖ ఉచితంగా బయోవేట్, రక్ష వీవ్యాక్ టీకాలు వేస్తోంది. ఈ ఉచిత టీకాలు వేసే కార్యక్రమాన్ని మార్చి 15 నుంచి ప్రారంభించింది. ఇందుకు జిల్లావ్యాప్తంగా 43బృందాలను నియమించింది. ఒక్కో బృందంలో ఒక వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, సబార్డినేట్, గోపాలమిత్రలు ఉన్నారు. బృందాలను మండల పశువైద్యాధికారి పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో 1,56,650 పశువులు ఉండగా ఇందులో 70248 తెల్లపశువులు, 86402 గేదెలు ఉన్నాయి. ఇప్పటివరకు 15శాతానికి పైగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు అధికారులు చెప్తున్నారు.

రంజాన్ వేళలు

గురువారం	శుక్రవారం
ఇఫ్తార్	సహర్
సా.6.33	ఉ.4.57


అల్లాహ్ తన వెలుగు వైపునకు తనకు ఇష్టమైన వారికి మార్గం చూపుతాడు

డీసీసీబీ చైర్మన్
భాస్కర్‌రెడ్డి రాజీనామా





నిజామాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): డీసీసీబీ బ్యాంక్ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ప్రకటనను విడుదల చేశారు. రాష్ట్ర సహకార శాఖ కమిషనర్‌కు తన లేఖను పంపించారు. ఆ లేఖలో డీసీసీబీ చైర్మన్‌తోపాటు డైరెక్టర్ పదవులకు రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. తన రాజీనామా లేఖను ఆమోదించాలని రాష్ట్ర కమిషనర్‌ను కోరారు. తనకు సహకరించిన డైరెక్టర్లకు, పాలకవర్గ సభ్యులకు, రైతులకు, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పదవులు వస్తుంటాయి, పోతుంటాయి వాటిని పట్టించుకొని పనిచేసే మనస్తత్వం తనది కాదని ఆ ప్రకటనలో తెలిపారు.

● చైర్మన్ రాజీనామాపై సహకార శాఖ అధికారుల తర్జనభర్జన

జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ భాస్కర్ రెడ్డి తన రాజీనామాను రాష్ట్ర సహకారశాఖ కమిషనర్‌కు పంపించారు. సహకార చట్టం ప్రకారం చైర్మన్‌గానీ, డైరెక్టర్‌గానీ పదవికి రాజీనామా చేస్తే నేరుగా వచ్చి అందించాలి. దాన్ని పరిశీలించిన మీదట సహకార శాఖ అధికారులు ఆమోదించాలి. ప్రస్తుత చైర్మన్ భాస్కర్‌రెడ్డి జిల్లా సహకార శాఖ అధికారికి కాకుండా రాష్ట్ర కమిషనర్‌కు పంపించారు. జిల్లాకు సంబంధించి రిజిస్ట్రార్‌గా జిల్లా సహకారశాఖ అధికారి వ్యవహరిస్తారు. పూర్తి నిబంధనలు పరిశీలించిన మీదటనే ఈ రాజీనామాపై వారు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. రాష్ట్ర సహకారశాఖ అధికారులు ఈ రాజీనామాను ఆమోదిస్తే నేడు జరిగే అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక సమావేశం నిలిపివేయనున్నారు. ఒకవేళ నిబంధనల ప్రకారం చైర్మనే రాజీనామా లేఖను అందించాలని భావిస్తే సమావేశాన్ని నిర్వహించనున్నారు. జిల్లా సహకార శాఖ అధికారి మాత్రం తనకు పూర్తిస్థాయి లేఖ అందిన తర్వాత పంపిస్తానని తెలిపారు. సమావేశంపై నేడు ప్రకటిస్తానని అధికారి తెలిపారు.

- వ్యవసాయ బావుల వద్ద దొంగల చేతివాటం
- కేబుల్ వైర్లు, పైపులు, ట్రాన్స్‌ఫార్మర్ల చోరీతో ఇబ్బందులు పడుతున్న రైతులు
- ఇటీవల దొరికిన దొంగలకు దేహశుద్ధి
- పలు కేసులు నమోదు


మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో దొంగలు ధ్వంసం చేసిన స్టార్టర్ డబ్బాలు

బాబోయ్ దొంగలు!

భిక్కనూరు, మార్చి20: ఒకవైపు భూగర్భజలాలు తగ్గి బోర్లు నీరు తక్కువగా పోయడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు కష్టాల్లో ఉండగా మరోవైపు దొంగలు వ్యవసాయబావుల వద్ద మోటర్లకు బిగించిన కేబుల్ వైర్లను, ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేస్తూ రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. భిక్కనూరు మండలంలో ఇలాంటి వరుస దొంగతనాలు జరుగుతుండటంతో రైతన్నలు బెంబేలెత్తుతున్నారు. ఈ దొంగతనాలు జరగకుండా వ్యవసాయబావుల వద్దనే రైతులు నిద్రిస్తున్న రైతన్నల కళ్లుకప్పి చాకచక్యంగా దొంగతనాలకు పాల్పడుతూ అందినకాడికి దోచుకెళ్తున్నారు.

● వరుస దొంగతనాలతో రైతుల ఇబ్బందులు

మండలవ్యాప్తంగా వ్యవసాయబావుల వద్ద కేబుల్‌వైర్లు, స్టార్టర్లు, పైపులు, వ్యవసాయ పని ముట్లతో పాటుగా ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ధ్వంసం చేసి ఆయిల్‌ను ఎత్తుకెళ్తున్నారు. ఈ వరుస దొంగతనాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఇటీవల చిన్నోళ్ల రాజయ్యకు చెందిన వ్యవసాయబావి వద్ద దొంగలు స్టార్టర్ డబ్బాలను ధ్వంసం చేసి ఇనుప పైప్‌లను ఎత్తుకెళ్లారు. ఈ స్టార్టర్ డబ్బాలు ధ్వంసం కావడంతో వాటి స్థానంలో కొత్తస్టార్టర్‌లను దాదాపు రూ.5వేలను పెట్టి కొనుగోలు చేసి బిగించాడు. భూగర్భ జలాలు తగ్గడంతో ఉన్న బోరుబావిలో దించడానికి రెండు పైప్‌లను కొత్తగా రూ.3వేలు పెట్టి కొనుగోలు చేశాడు. ఈ ఒక్క దొంగతనంతో రాజయ్యకు రూ.6,500 ఖర్చు చేయాల్సి వచ్చింది. మండలంలోని గుర్జకుంట గ్రామంలో ఇటీవల దాదాపుగా 6 ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని ఆయిల్, కాపర్‌ను ఎత్తుకెళ్లారు. అదే గ్రామంలో దాదాపు 30 బోరుబావుల నుంచి కేబుల్‌వైరు, వ్యవసాయ పనిముట్లు, పైపులను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ కేబుట్‌వైర్లు చోరి కావడంతో వరిపంట, మొక్కజొన్న, కూరగాయపంటల సాగుకు నీరందక రైతులు ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటుగా కొత్త కేబుల్‌వైర్లను, వ్యవసాయ పనిముట్లను కొనుగోలు చేయ్యడంతో దాదాపు 20మంది రైతులు అదనంగా ఖర్చులపాలయ్యారు. ఎన్నిసార్లు వ్యవసాయబావుల వద్ద కాపాల కాసిన రైతుల కళ్లుకప్పి చోరీలకు పాల్పడుతున్నారు. భిక్కనూరు, అంతంపల్లి, లక్ష్మీదేవునిపల్లి, తిప్పాపూర్, ర్యాగట్లపల్లి గ్రామాల్లో సైతం ఇలాంటి దొంగతనాలు ఇటీవల జరుగుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

● ఇటీవల దొరికిన దొంగలకు దేహశుద్ధి

మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయబావుల వద్ద చోరీలకు పాల్పడుతున్న దొంగలను పట్టుకునేందుకు రైతులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం ఉండటం లేదు. కానీ భిక్కనూరు పట్టణంలోని అంతంపల్లి గ్రామ శివారులో ఇటీవల చోరీ చేసిన కేబుల్‌వైరును కాల్చుతున్నారన్న పక్కా సమాచారంతో ఆకస్మాత్తుగా ఆ ప్రదేశానికి వెళ్లి కేబుల్‌వైరును కాల్చుతున్న ఇద్దరిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని గ్రామంలోకి తీసుకువచ్చి విద్యుత్ స్తంభానికి కట్టేసి చితకబాది పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా నిందితుల వద్ద నుంచి కాపర్ వైరును, కేబుల్‌వైరును స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని గుర్జకుంట గ్రామంలో ఇటీవల వ్యవసాయబావుల వద్ద కేబుల్ వైర్లను, వ్యవసాయ పనిముట్లను దొంగతనం చేసిన యువకుడిని గుర్తించి గ్రామంలోకి తీసుకెళ్లి చితకబాది పోలీసులకు అప్పగించి ఫిర్యాదు చేశారు. ఈ దొంగతనం సమయంలో రైతు చేతి వేలును దొంగ విరగ్గొట్టడం కొసమెరుపు. అక్కడక్కడా దొంగతనాలకు పాల్పడుతున్న వారిని రైతులు పట్టుకుని దేహశుద్ధి చేసిన, పోలీసు కేసులు అవుతున్న దొంగతనాలను మాత్రం మానడం లేదు.

సాగు కష్టంగా మారింది..

● జైపాల్, రైతు గుర్జకుంట



వరుస దొంగతనాలతో పంటల సాగు కష్టంగా మారింది. మా వ్యవసాయ బావి వద్ద ఇప్పటివరకు మూడు బోరుమోటార్లకు సంబంధించి మూడుసార్లు కేబుల్‌వైరును దొంగలు ఎత్తుకెళ్లారు. ఒక్క బోరుమోటారును బయటకు తీసి బిగించాలంటే దాదాపుగా రూ.1200 ఖర్చు అవుతుంది. మొత్తంగా ఇప్పటివరకు ఈ కేబుల్‌వైరు దొంగతనం కారణంగా రూ.16వేల వరకు ఖర్చు కాగా రూ.10వేల మేర నష్టపోయా.

పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి

● రమేష్ రెడ్డి, రైతు, గుర్జకుంట

వ్యవసాయబావుల వద్ద దొంగతనాలకు పాల్పడూ రైతులను ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్న దొంగలను పట్టుకుని కఠినంగా శిక్షించాలి. నా వ్యవసాయ బావి వద్ద ఇప్పటివరకు మూడుసార్లు కేబుల్‌వైర్లు చోరీకి గురయ్యాయి. దింతో పొట్టదశలో ఉన్న వరిపంట, మొక్కజొన్న పంట, కూరగాయాలకు నీరు అందించడం కష్టంగా మారుతుంది. కేబుల్‌వైర్లను కొనుగోలు, బోరు మోటార్లను బయటకు తీసి బిగించడం ఖర్చుతో కూడుకున్నది. మా గ్రామంలో ఇప్పటివరకు చాలామంది వ్యవసాయబావుల వద్ద కేబుల్ వైర్లు, పనిముట్లు, పైపులు చోరీకి గురయ్యాయి.

మూల్యాంకనం విధులకు హాజరుకావాలి

● రిలీవ్ చేయని ప్రిన్సిపాళ్లపై, రిలీవ్ చేసినా..

విధుల్లో పాల్గొనని అధ్యాపకులపై చర్యలు : డీఐఈవో

నిజామాబాద్ అర్బన్, మార్చి 20: జిల్లా కేంద్రంలోని ఇంటర్ మూల్యాంకన కేంద్రంలో జవాబు పత్రాల మూల్యాంకనం ఈ నెల 22న శుక్రవారం ముందస్తుగా ప్రారంభమవుతుందని, ఇదివరకు నిర్ణయించిన విధంగా ఈ నెల 22నే హాజరుకావాలని డీఐఈవో రఘురాజ్ తెలిపారు. 22న కామర్స్, కెమిస్ట్రీ, జువాలజీ, హిస్టరీ, బోటనీ సబ్జెక్టులకు సంబంధించిన మూల్యాంకనం ప్రారంభంకానున్న నేపథ్యంలో మూల్యాంకన విధుల్లో పాల్గొనవల్సిన అధ్యాపకులు తప్పక హాజరుకావాలన్నారు. లేకపోతే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి ఇంటర్ బోర్డ్ సిద్ధంగా ఉందని తెలిపారు. ఇప్పటికే ఆయా కళాశాలల లాగిన్‌లలో నియామకపత్రాలను ఉంచడం జరిగిందని జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, సాంఘిక సంక్షేమం, మోడల్ స్కూల్, కేజీబీవీ, మైనార్టీ, బీసీ రెసిడెన్షియల్, ఇతర అన్ని జూనియర్ కళాశాలల్లో ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులను తమ విధుల నుంచి ఈనెల 21న రిలీవ్ చేసి మూల్యాంకన కేంద్రంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. రిలీవ్ చేయని ప్రిన్సిపాళ్లపై, రిలీవ్ చేసినా విధుల్లో పాల్గొనని అధ్యాపకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెంటనే అధ్యాపకులు తమకు కేటాయించిన మూల్యాంకన సబ్జెక్టులో రిపోర్ట్ చేయాలని ఆయన కోరారు.

పెరిగిన ఉపాధి కూలీల సంఖ్య

● ప్రతీఒక్కరికి పనులు కల్పిస్తామంటున్న అధికారులు ● వచ్చే ఆర్థిక సంవత్సరంలో పెరగనున్న కూలీలు



డొంకేశ్వర్‌లో చెరువులో పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

డొంకేశ్వర్, మార్చి20: గత నెలతో పోల్చుకుంటే మార్చి నెలలో కూలీల సంఖ్య ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగు స్తుండడంతో మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన లక్ష్యాన్ని చేసుకొని ఉమ్మడి డొంకేశ్వర్, నందిపేట్ మండలంలోని కూలీలకు ఉపాధి కల్పించడంలో ముందుంది. గత నెలతో పొల్చుకుంటే ఈనెలలో కూలీల సంఖ్య అధికంగా పెరిగిందని, గత నెలలో 800మంది కూలీలకు పని కల్పించగా మార్చి నెలలో 2200మందికి పని కల్పిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. 2023-24ఆర్థిక సంవత్సరంలో ఉమ్మ డి మండలానికి నాలుగు లక్షల పని దినాలను కల్పించినట్లు ఈజీఎస్ అధికారులు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరకు చేరుతుంది. ఈనెలాఖరు లోగా వంద రోజుల పని దినాలు నిండని కూలీలకు ఉపాధి కల్పించేందుకు గ్రామల్లో పనులను వేగం చేస్తున్నారు. ఉమమడి డొంకేశ్వర్, నందిపేట మండల వ్యాప్తంగా 21వేల మంది కూలీలు ఉన్నారు. ఇందులో ప్రస్తుతం 2200మంది తరచుగా కూలీ పనులకు వస్తున్నట్లు ఈజీఎస్ అధికారులు పేర్కొన్నారు. ఉమ్మడి మండలం వ్యాప్తంగా 21వేల మందికి జాబ్‌కార్డులు ఉండగా ప్రస్తుతం 2200 మందికి యాక్టివ్ జాబ్‌కార్డులు ఉన్నాయి. మండలంలో ప్రతీరోజు 2200నుంచి 2300వరకు కూలీలు ఉపాధి పనులకు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరా నికి నాలుగు లక్షల పని దినాలు కల్పించాలని, లక్ష్యంతో మండల అధికారులు ముందుకు సాగుతున్నారు. కానీ ఇప్ప టికీ నాలుగు లక్షల పని దినాలు కల్పించినట్లు ఏఈవో సవిత తెలిపారు. అనుకున్న లక్ష్యాన్ని కంటే ఎక్కువగా కల్పించేందుకు ముందుకు సాగుతు న్నట్లు ఆమె పేర్కొన్నారు. ఏప్రిల్ మాసం నుంచి నూతన పని దినాలు ప్రారంభమవుతుండడంతో అప్పులు పనులకు వచ్చేవారి సంఖ్య మరింత పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

వ్యవసాయ పనుల్లో నిమగ్నం

మండలంలో వివిధ గ్రామాల్లో ప్రస్తుతం మొక్కజొన్న, పసుపు పంట కోతలు రావడంతో దీంతో కూలీలు వ్యవసాయ పనులకే వెళ్తున్నారు. వచ్చే నెలలో పంట పనులు పూర్తి కావడంతో కూలీలు ఉపాధి హామీ పనులకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

● రెండు నెలలుగా అందని కూలీ డబ్బులు

గత రెండు నెలలుగా ఉపాధి హామీ కూలీలకు పని చేసిన డబ్బులు రాక ఇబ్బందులుపడుతున్నారు. జనవరిలో వచ్చిన డబ్బులు తప్ప మళ్లీ ఇప్పటి వరకు కూలీలకు డబ్బులు ప్రభుత్వం నుంచి అందలేవని కూలీలు వాపోతున్నారు. మండుటెండలు పని చేసిన ఉపాధి కూలీలు డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు. పెరుగుతున్న ధరలు, నిత్యవసర ఖర్చుల సర్దుబాటుకు చేసుకునేందుకు ఇబ్బందులుపడుతున్నారు. ఉమ్మడి మండలంలో ఉపాధి పని చేస్తున్న కూలీలు దాదాపు రెండు నెలల బకాయిల డబ్బుల కోసం పడిగాపులు కాస్తున్నారు. నిజానికి ఉపాధి హామీ పథకంలో పని చేసిన రెండు, మూడు వారాలకే కూలీ డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ చేయాలి. అలా జరగక నెలలుగా కూలీ డబ్బులు అందడంలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూలీల సంఖ్య పెరిగింది : సవిత, ఏపీవో

మార్చి నెల కావడంతో వంద రోజుల పని దినాలు పూర్తి చేసిన వారికి కాకుండా వంద రోజుల పని దినాలు దగ్గరలో ఉన్న కూలీలకు పనులు కల్పిస్తున్నాం. గత నెలలో పొల్చు కుంటే ఖూలీల సంఖ్య ఈనెలలో అత్యధికంగా పెరిగింది. ఏప్రిల్ నెలలో కూలీల సంఖ్య అధికంగా పెరిగే అవకాశం ఉంది.

మూడు నెలలుగా డబ్బులు అందలే

వనసేవకుడిగా గత మూడేళ్లగా పని చేస్తున్న గత మూడు నెలల నుంచి కూలీ డబ్బులు రాక ఇబ్బందిగా ఉంది. కుటుంబ పోషణ భారంగా ఉంది. పని చేసిన వెంటనే డబ్బులు వస్తే బాగుంటుంది.

- ముత్తెన్న, ఉపాధి హామీ కూలీ, మారంపల్లి

మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి : షబ్బీర్‌అలీ





ఇఫ్తార్ విందులో పాల్గొన్న షబ్బీర్ అలీ, హాజరైన నాయకులు

నిజామాబాద్ అర్బన్, మార్చి 20: మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని మాజీ మంత్రి, ప్రభుత్వ సలహాదారుడు మహ్మద్ అలీ షబ్బీర్‌అలీ అన్నారు. బుధవారం నిజామాబాద్ నగరంలోని మాలపల్లి కాలనీ డీలక్స్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో షబ్బీర్ అలీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈకార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూఅకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్, హరున్‌ఖాన్, ఖుద్దూస్,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మోటాడిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో మినీ బార్!

● గూపన్‌పల్లిలో మద్యం, మాంసం విక్రయం ● ట్రైనీ ఐపీఎస్‌కు ఫిర్యాదుచేసిన స్థానికులు



నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్న రూరల్ పోలీసులు

నిజామాబాద్ రూరల్, మార్చి 20: జిల్లా కేంద్రంలోని గూపన్‌పల్లిలో మద్యంబాబులు హల్‌చల్ చేస్తున్నారు. జనావాసాల మధ్యనే బార్‌ను తలపిస్తూ నిత్యం మద్యం సేవిస్తూ స్థానికులకు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గూపన్‌పల్లి గ్రామ నడిబొడ్డున ఉన్న మోటాడిరెడ్డి కళ్యాణ మండపాన్ని దీన్ని వేదికగా చేసుకున్నారు. ఇక్కడ ఖరైదన మద్యంతోపాటు మా ంసం కూడా విక్రయిస్తూ సిటింగ్‌కోసం టేబుల్స్ ఏర్పాటుచేశారు.దాంతో ప్రతిరోజు ఇక్కడ మ ద్యంబాబులు మద్యం సేవిస్తూ స్థానికులకు చికాకుతెప్పిస్తున్నారు. బుధవారం గూపన్‌పల్లి లో పోలీసులు కళాజాత నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ట్రైనీ ఐపీఎస్ చైతన్యరెడ్డి వచ్చి స్థానికులకు అవగాహన కల్పించారు. అనంతరం పలువురు మహిళలు, స్థానికులు మద్యంబాబుల ఆగడాల గురించి స్వయంగా చెప్పి ఆమెను దగ్గరుండి అక్కడికీ తీసుకెళ్లారు. అక్కడ టేబుళ్ల వద్ద 20 మంది మద్యం సేవిస్తూ కంటపడ్డారు. నిర్వహిస్తున్న నిర్వాహకుడు గౌడ్‌ను ప్రశ్నించగా, తాను ఎలాంటి అనుమతి తీసుకోలేదని తెలిపారు.ఎన్నికల కోడ్‌ఉన్నం దున అనుమతి లేకుండా దాబా, బార్ నిర్వహించడం నేరమని సూచించారు. నిర్వాహకుడిని రూరల్ ఎస్‌హెచ్‌వో మహేష్ రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదుచేసినట్లు తెలిపారు. మద్యంసేవిస్తున్న వారి వివరా లు తీసుకుని వారిని పంపించారు. స్థానికులు, మహిళలు ట్రైనీ ఐపీఎస్ చైతన్యరెడ్డికి ధ న్యవాదాలు తెలిపారు.ఎన్నిసార్లు విన్నవించినా తమమాట వినలేదని, చివరికి పో లీసులకు రెడ్‌హండ్‌గా చిక్కడంతో మినీబార్ బంద్ అయిం దని తెలిపారు. ఈమినీ బారన్‌ను గూపన్‌ఫల్లిలోని స్థానిక నేతలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది.

గాలికుంటు వ్యాధి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం



గాలికుంటు టీకాలను పశువులకు వేస్తున్న అధికారులు

మోపాల్, మార్చి 20: పశువులకు ఎటువంటి వ్యాధులు రాకుండా ఉండేం దుకు ప్రతి సంవత్సరం గాలికుంటు వ్యాధి టీకాలను వేయడం జరుగుతోందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జగన్నాథచారి అన్నారు. బుధవారం మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామాల్లో పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారని తెలిపారు. మండ లంలో ఉన్న పశువులన్నింటికి ప్రతీ సంవత్సరం టీకాలు వేయడం జరుగుతోందని తెలిపారు. జిల్లాలో ఒకలక్షా 50వేల ఆవులు, 2లక్షల 20వేల గేదెలు అన్నింటికి టీకాలు వేయడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేందర్, సుజాత, నరేష్, చిత్ర, రజినీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

నందిపేట: మండలంలోని ఐలాపూర్ గ్రామంలో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను మండల పశు వైద్యాధికారి డాక్టర్ హన్మంత్‌రెడ్డి ఇచ్చారు. గ్రామంలోని సుమారు 610పశువులకు టీకాలు చేస్తూ రైతులకు గాలికుంటు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది సరళ రాణి, విజయ, స్వప్న, శ్యామల, సత్యం, రైతులు తధితరులు ఉన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్, చందమియాబాగ్ తండా గ్రామాల్లో బుధవారం పశువులకు, ఆవులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ రెండు గ్రామాల్లో సుమారు పశువులకు, ఆవులకు 979పశువులు, ఆవులకు కలిపి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామని పశువైద్యాధికారిణి తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పూసపల్లి కుట్ర కేసును ఎత్తివేయాలి

సిరికొండ మార్చి 20 :ఖమ్మం జిల్లా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులపై పెట్టిన పూసపల్లి కుట్ర కేసును ఎత్తివేయాలని ఆ పార్టీ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సిరికొండలో విడుదల చేసిన పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఏజెన్సీ గ్రామాల్లో పోలీసుల కూంబింగ్‌ను వెంటనే నిలిపి వేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి ఆశోక్‌ను వెంటనే విడుదల చేయాలని భాస్కర్ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 14న మోటర్ బైక్‌లపై ప్రయాణిస్తున్న వజ్జయ్య(అశోక్),సమ్మయ్యమదార్,సురేష్‌లను కోయచలక సమీపంలో ఖమ్మం పోలీసులు అరెస్టు చేశారని ఆయన పేర్కొన్నారు.ఇల్లందు సమీపంలోని పూసపల్లి వద్ద దళం దొరికినట్లు కేసుపెట్టి అరెస్టులు చేస్తున్నారని భాస్కర్ తెలిపారు. పూసపల్లి కేసును ఎత్తివేసి కూంబింగ్‌లను నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ కార్యక్రమం



చిన్నారులకు అన్న ప్రాసన చేస్తున్న దృశ్యం

బోధన్ రూరల్, మార్చి 20 : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని చేపట్టిందని ఐసీడీఎస్ సీడీపీవో జానకి అన్నారు. బుధవారం బోధన్ మండలంలోని సంఘం గ్రామంలోని రైతు వేదికలో మండల స్థాయి పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో జానకి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు 0-6 ఏళ్ళ మధ్య ఉన్న పిల్లలకు పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించారు. విద్య, ఆరోగ్యమే లక్ష్యంగా పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. తల్లితో పాటు శిశువు సంపూర్ణ ఆరోగ్యంగా జీవించేందుకు వెయ్యి దినాల ప్రణాళిక ప్రాముఖ్యత విశిష్టతను వివరించారు. గర్భధార ణ నుంచి ప్రసవం వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, పౌష్టికాహారం గురించి, తల్లి ఆరోగ్యంతో పాటు శిశువు ఆరోగ్య పరిరక్షణ గురించి పేర్కొన్నారు. ఆరోగ్యం, విద్యకు ప్రాముఖ్యతను అంగన్‌వాడీ కేంద్రాల్లో కల్పిస్తున్నామని, ప్రైమరీ దశలోనే శిశువులకు విద్యపై అవగాహన కల్పించేలా అంగన్‌వాడీ టీచర్లు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం శ్రీమంతాలు, అన్న ప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ రాధికా, అంగన్‌వాడీ టీచర్లు సౌజన్య, గంగావేణి, గోపి లక్ష్మీ, ఆసియా బేగం, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: పోషన పక్వడ కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలు ,చిన్నారుల సంరక్షణకు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ రసుల్‌బీ అన్నారు. మండలంలోని యానంపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన పోషన పక్వడ కార్యక్రమంలో డీడబ్ల్యూవో తో పాటు ఇంచార్జ్ సీడీపీవో స్వర్ణల త పాల్గొని మాట్లాడారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు ఆరోగ్య లక్ష్మీ భోజనం తప్పకుండా చేయాలని ప్రతి రోజు పోషక ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటరన్నారు. అనంతరం సామూహిక సీమంతలు అన్నప్రసన్న అక్షర అభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైసర్‌లు సరిత, సవిత, శోభా, రాధలక్ష్మీ వరలక్ష్మీ, శ్రీప్రియ, బుజ్జి, భాగ్యలక్ష్మీ, కోఆర్డినేటర్ రాంబాబు, రంజిత్, ఆశ వర్కర్స్ , అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు

ఖిల్లా, మార్చి 20: అనారోగ్యంతో మృతి చెందిన రెండు అనాథ మృతదేహాలకు ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ అంత్యక్రియలు నిర్వహించారు. గత ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన రెండు అనాథ శవాలకు ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అంత్యక్రియలు నిర్వహించుమని ఒకటవ టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్ బాబు కోరగా బుధవారం దేవిథియేటర్ పక్కన గల సార్వజనిక్ స్మశాన వాటికలో సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహిం చారు. అం త్యక్రియలు నిర్వహించినట్లు ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మద్దుకూరి సాయిబాబా తెలిపారు. అనాథలుగా ఎవరూలేని నిస్సహాయ స్థితిలో మృతి చెందిన అనాద శవాలకు తమ సంస్థ అన్నివారై పోలీసుల అనుమతితో అంతిమ సంస్కారాలు నిర్వహించడంలో ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్ర మంలో ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యవర్గం కాసుల సాయి తేజ, మద్దిగంగాధర్, జయదేవ్, ఒకటవ టౌన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

జాతీయ జూనియర్ బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

డిచ్‌పల్లి, మార్చ్ 20: ఈ నెల 10న కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి జట్టు ఎంపికలో జిల్లా క్రీడకారులు దీపకీర్తన, (సాంఘిక సంక్షేమ కళాశాల , ధర్మారం(బి)), దేవిశ్రీ, సిందుల(సాంఘిక సంక్షేమ కళాశాల సుద్దపల్లి), వైష్ణవి, నిహారిక (సాంఘిక సంక్షేమ కళాశాల ఆర్మూర్), క్రీడ పోటీల్లో పాల్గొని చక్కని ప్రతిభ కనబర్చి ఈ నెల 22నుంచి 25 వరకు పంజాబ్ లోని సంగుర్‌లో జరగనున్న 31 వజాతీయ జూనియర్ బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసుదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వినోద్ తెలిపారు. క్రీడకారులను బుధవారం సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ధర్మారం(బి)లో అభినందించారు. ఈ అభినందన కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ విద్యాసంస్థల ప్రాంతీయ అధికారిని అలివేలు, జిల్లా అధికారిని సంగీత, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నీరాజ, జిల్లా కోశాధికారి మల్లేశ్ గౌడ్, ఉపాధ్యక్షుడు గంగామోహన్, సభ్యులు గంగాధర్, సాఫ్ట్‌బాల్ అకాడమీక్ కోచ్ నరేశ్, పీఈటీ జ్యోత్స్న లు పాల్గొన్నారు.

మానాల మోహన్‌రెడ్డిని సన్మానించిన ఏర్గట్ల మండల కాంగ్రెస్ నాయకులు



మానాల మోహన్‌రెడ్డిలను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిజామాబాద్‌అర్బన్, మార్చి 20 : తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ చైర్మన్‌గా నియమితులైన మానాల మోహన్‌రెడ్డిని ఏర్గట్ల మండలంలోని దోంచంద గ్రామ కాంగ్రెస్ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. నిజామాబాద్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి.. శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏర్గట్ల మండల నాయకులు వంకాయల వెంకట్‌రెడ్డి, కొరిపెల్లి లింగారెడ్డి, మల్లారెడ్డి, అశ్రక్, వాసిరెడ్డి హన్మంత్‌రెడ్డి, పెద్ద హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడా రాంమందిర్ వ్యవసాయ భూముల పరిశీలన

నిజామాబాద్ రూరల్, మార్చి 20: జిల్లాకేంద్రంలోని బడా రాంమల్, బ్రహ్మపురి, గాజుల్‌పేట్‌తోపాటు శ్రీనుమాన్ దేవాలయంకు సంబంధించిన వ్యవసాయ బూములను దేవాదాయ శాఖ అదికారులు పరిశీలించారు. బుదవారం ఉదయం దేవాలయానికి సంబందించిన వ్యవసాయక్షేత్రాల్లో రెవెన్యూ, దేవాదాయ, సర్వే అధికారులు స్వయంగా పరిశీలించారు. పట్టాభూమికి సంబంధించిన సర్వేనెంబర్‌లను గుర్తించారు. సర్వేనెంబర్ 992లో ఎకరాలు 04.05 గుంటలు, 993లో ఎకరాలు 03.31 గుంటలు, 994లో ఎకరాలు 02.30 గుంటలు, 1001లో ఎకరాలు 02.35 గుంటలు, 1002లో ఎకరాలు 03.33 గుంటలు, 1011లో ఎకరాలు 03.34 గుంటలు, 1012లో ఎకరాలు 02.32 గుంటలు, 1013లో ఎకరాలు 02.24 గుంటలు, 1014లో ఎకరాలు 03.18 గుంటలు, మొత్తం 28 ఎకరాల 32 గుంటల భూమి ఉన్నట్లు నిర్ధారించారు. ఈ సర్వేలో సర్వేయర్‌లు సోమసుదర్శన్, సయ్యద్, దేవాదాయ శాఖ పరిశీలకులు బీకమల సమక్షంలో సర్వే నిర్వహించారు. వివిధ ఆలయాల జూనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పాఠశాల పక్కన మురికి కాల్వను పరిశీలిస్తున్న ఎంపీపీ, ఎంపీటీసీలు

కిచెన్ షెడ్, డ్రైనేజీల నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు మంజూరు

బీర్కూర్, మార్చి20: పాఠశాలల్లో కిచెన్‌షెడ్‌ను, పాఠశాల పక్కన డ్రైనేజీ కాల్వల నిర్మాణానికి మండల పరిషత్ నిధుల నుంచి రూ.10లక్షలు మంజూరైనట్లు ఎంపీపీ రఘు తెలిపారు. బీర్కూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలను బుధవారం ఎంపీపీ రఘు, ఎంపీటీసీ సందీప్, నాయకులు మన్నన్, రఘులు సందర్శించారు. పాఠశాలలో కిచెన్ షెడ్‌ను, పాఠశాల పక్కన డ్రైనేజీని నిర్మించేందుకు మండల పరిషత్ నిధుల నుంచి రూ.10 లక్షలు కేటాయించినట్లు ఎంపీపీ రఘు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ, ఎంపీటీసీ సందీప్‌లు మాట్లాడుతూ బీర్కూర్‌లో ఇటీవల నూతనంగా నిర్మించిన బీసీ గురుకుల పాఠశాలలో కిచెన్ షెడ్ నిర్మించలేదన్నారు. దీంతో ప్రతిరోజు విద్యార్థులకు భోజనాలు, అల్పాహారం వండటానికి సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. దీనికి తోడు పాఠశాల నుంచి బయటకు వెళుతున్న మురికి నీరు రోడ్డుపై పారుతుందన్నారు. కిచెన్ షెడ్, డ్రైనేజీలను నిర్మించాలని గురుకుల ప్రిన్సిపాల్ మాధవి తమ దృష్టికి తీసుకువచ్చిందని అన్నారు.

కూడళ్లలోని వాల్ పోస్టర్ల తొలగింపు



వాల్ పోస్టర్లను తొలగిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

మద్నూర్, మార్చి 20: ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ అధికారులు గ్రామ ప్రధాన కూడళ్ల వద్ద పలు గోడలకు ఉన్న వాల్ పోస్టర్లను తొలగిస్తున్నారు. మండల కేంద్రంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో ఆయా పార్టీలకు సంబంధించిన వాల్ పోస్టర్లను గ్రామ పంచాయతీ సిబ్బంది బుధవారం తొలగించింది. మండల కేంద్రంతో పాటు గ్రామాలలో పార్టీలకు సంబంధించిన వాల్ పోస్టర్లు, తదితర వాటిని తొలగిస్తున్నట్లు తహసీల్దార్ ముజీబ్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆయా పార్టీలు, నాయకులు ఎన్నికల కోడ్‌కు లోబడి కార్యక్రమాలు చేపట్టాలని, ఎవరూ కోడ్‌ను ఉల్లంఘించరాదని సూచించారు. పార్టీలకు సంబంధించి పోస్టర్లు ఉంటే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేదంటే ప్రభుత్వమే తొలగిస్తుందని చెప్పారు.

మహిళల కోసం యోగా కేంద్రం ప్రారంభం

కామారెడ్డిరూరల్, మార్చి20: జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలోని మహిళల కోసం యోగా కేంద్రాన్ని ఆచార్య కవిత బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ రోజు సాయంత్రం ఉచిత యోగా తరగతులు ఉంటాయని, ఆసక్తి ఉన్న మహిళలు పాల్గొనవచ్చని కోరారు. ముద్ర ఆసనాలు, ప్రాణాయము, ధ్యానము ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో యోగా కేంద్రం జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, అంజయ్య, సత్యమిత్ర, బాస రఘు కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్‌ను కలిసిన పాఠశాల కమిటీ

బాన్సువాడటౌన్, మార్చి20: ఆగ్రో ఇండస్ట్రీస్ రాష్ట్ర చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌ను బుధవారం శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శిశుమందిర్ పాఠశాల 31వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేయాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు నాగులగామ వెంకన్నగుప్త, బెజుగం సత్యనారాయణ, సిర్న దత్తన్న, గుడాల నగేష్, నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన సదస్సు

దోమకొండ, మార్చి 20: పోషణపక్షంలో భాగంగా ఐసీడీఎస్ దోమకొండ సెక్టార్‌లో గర్భిణీ, బాలింత, పిల్లలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. రక్తహీనత, చిరుధాన్యాలు, తల్లిపాలు, పోషణ్ అభియాన్‌పై వివరించారు. గర్భిణీ, బాలింతలకు పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అలాగే పురుషులతో వంటల కార్యక్రమం, శ్రీమంతలు, అన్నప్రసన్న అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా (పోషన్) మిషన్ కోఆర్డినేటర్ ప్రియాంక,శిరీష, సూపర్ వైజర్ నిర్మలా, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



దోమకొండలో నిర్వహించిన చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న గర్భిణులు, బాలింతలు

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత కరువు

- నాణ్యత లేని ఇసుక, కంకరతో పనులు
- వేసిన వారం రోజుల లోపే పగుళ్లు
- కొలతల్లోనూ లోపాలు ఉన్నాయంటున్న గ్రామ ప్రజలు

ఎల్లారెడ్డి, మార్చి 20: మండలంలోని గ్రామాల్లో చేపడుతున్న సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత కరువైంది. కేంద్రప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మంజూరైన నిధులతో గ్రామాల్లో రోడ్ల సౌకర్యం లేని ప్రాంతాలలో రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించిన నిధులతో చేపడుతున్న ఈ పనులను ఈనెల 31లోగా పూర్తి చేయాల్సి ఉండగా, కొందరు కాంట్రాక్టర్లు గ్రామాల్లో హడావుడిగా సీసీ రోడ్లను నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారు. ఫలితంగా సీసీ రోడ్డు వేసిన వారం రోజుల్లోనే రోడ్డుపై పగుళ్లు ఏర్పడుతున్నాయి. ఎల్లారెడ్డి మండలంలోని వివిధ గ్రామ పంచాయితీలలో ఒక్కో పంచాయితీకి సుమారు 5 నుంచి 10లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. అయితే రోడ్డు నిర్మాణంలో పాటించాల్సిన నాణ్యత ప్రమాణాలు పాటించకుండా కొన్నిచోట్ల కంకర నాణ్యత లేని ఇసుకతో, మరి కొన్ని గ్రామాల్లో కంకర డస్టుతో రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. పనులు జరిగే ప్రదేశంలో సంబంధిత పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పర్యవేక్షణ కరువైందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా సీసీ రోడ్ల కొలతలు తీసుకో వాల్సిన అధికారులు తీసుకోకుండా అనుభవం లేని కిందిస్థాయి సిబ్బందితో కొలతలు తీసుకుంటున్నారు. పది కాలాలపాటు ఉండాల్సిన సీసీ రోడ్లు వారంలోపే పగుళ్లు రావడం పట్ల గ్రామీణ ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై నడవాలంటే నరకయాతన ఎదుర్కోవాల్సి వస్తుందని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి నాణ్యమైన మెటీరియల్‌తో రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



కొత్తగా వేసిన సీసీ రోడ్డుపై ఏర్పడిన పగుళ్లు



క్యూరింగ్ లేక సీసీ రోడ్డుకు ఏర్పడుతున్న పగుళ్లు

మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డిరూరల్, మార్చి20: జిల్లా కేంద్రంలోని తెలంగాణ ప్రభుత్వ మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర, బాలికల ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్‌లు నారాయణ గౌడ్, ప్రణీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలుర, బాలికల మైనార్టీ రెసిడెన్షియల్ 5, 6, 7, 8వ తరగతుల 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం ఈనెల 31 నుంచి రిజిస్ట్రేషన్‌లు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని మైనార్టీ ముస్లింలు, క్రిస్టియన్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత విద్య, భోజనం, వసతితోపాటు పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్, యూనిఫామ్స్ ప్రభుత్వం అందజేస్తుందని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్‌ను సంబంధిత వెబ్‌సైట్‌లో చేసుకోవాలని తెలిపారు. ప్రవేశాలకు సంబంధించిన ఏవైనా సందేహాలు ఉంటే 94413135327 నెంబర్‌కు సంప్రదిం చాలని పేర్కొన్నారు.

ఉపాధ్యాయురాలికి షోకాజ్ నోటీసు

కామారెడ్డి రూరల్, మార్చి20: ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన బిచ్కుంద మండల ప్రజాపరిషత్ పాఠశాల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయురాలు కృష్ణవేణికి ఫైనల్ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డీఈవో రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2 నవంబరు 2022 నుంచి ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరవుతున్నారని ప్రస్తుతం విదేశాలలో ఉన్నట్లు విచారణలో తేలిందని పేర్కొన్నారు. సీసీఏ నిబంధనల మేరకు ఉద్యోగం నుంచి ఎందుకు తొలగించరాదో సమాధానం ఇవ్వవాల్సింది గా ఈనెల 18న తుది షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు గెజిట్‌లో ప్రచురించామని, 10రోజులో సమాధానం ఇవ్వకపోతే సర్వీసు నుంచి తొలగిస్తామని తెలిపారు.

మంథని దేవునిపల్లిలో హైమాస్ట్ లైట్లను ప్రారంభించిన ఎంపీపీ

మాచారెడ్డి, మార్చి 20: పల్వంచ మండలం మంథని దేవునిపల్లి గ్రామ స్వాగత తోరణం వద్ద బుధవారం ఎంపీపీ నర్సింగ్‌రావు ఐమాక్స్ లైట్ ప్రారంభించారు. ఎంపీపీ తన సొంత డబ్బులతో ఐమాక్స్ లైట్‌ను ఏర్పాటు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అరవింద్, రామ్మోహన్, భవానిపేట, రాజు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు సామూహిక సీమంతం చేస్తున్న అధికారులు

గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి

- సీడీపీవో సునంద

మద్నూర్, మార్చి 20: గర్భిణీ, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో సునంద సూచించారు. డోంగ్లీ మండలంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో సునంద, డోంగ్లీ మండల ఐసీడీఎస్ వర్కర్స్ అధ్యక్షురాలు సచిత పాల్గొని గర్భిణీ, బాలింతలకు పలు సూచనలు చేశారు. సీడీపీవో సునంద మాట్లాడుతూ.. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటేనే పుట్టబోయే శిశువు ఆరోగ్యంగా ఉంటుందని వివరించారు. ఇందులో భాగంగా పోషణాభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిరుధాన్యాలు, పోషణాభియాన్‌పై గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రేణుక చౌహాన్, సూపర్‌వైజర్, వర్కర్లు పాల్గొన్నారు.

కులగణనతోనే వర్గీకరణ సాధ్యం: పిడమర్తి రవి

డిచ్‌పల్లి, మార్చి 20: కులగణనతోనే ఎస్సీ వర్గీకరణ మరియు అన్ని కులాల సమస్యలకు పరిష్కారం లభిస్తోందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డా.పిడ మర్తి రవి అన్నారు. మాదిగల పార్లమెంట్ నియోజకవర్గ సదస్సులో భాగంగా బుధవారం మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో బరికుండ శ్రీనివాస్ మాది గ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో పిడమర్తి రవి మాట్లాడుతూ.. కులగణన చేయకుండా బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని, తద్వార ఎస్సీఎస్టీ, బీసీ మైనార్టీ కులాల్లో సమస్యలు అలానే ఉన్నాయని కేవలం కులగణన చేస్తేనే ఎస్సీ వర్గీకరణకు సాధ్యమవుతుందన్నారు.ఉత్తర తెలంగాణ ప్రజలకు అల్లర్లకు,మతవిద్వేశాలకు, తావివ్వకుండా వర్గీకరణ చేసే వారికే ఆదరించా లన్నా రు. మాదిగలను మోసం చేయడానికి చూస్తే మోసపోవడానికి సిద్ధంగా లేర న్నారు. 12శాతం జనాభా కలిగిన మాదిగాలకు అన్ని రంగాల్లో వాటా కల్పిం చి న్యాయం చేయలన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసీ నాయకులు శ్రీనివాస్, గంగారం, ఎమ్ఎహెచ్‌పీఎస్ అధ్యక్షుడు ఉపేందర్, సోమనాథం, మాజీ సర్పంచ్ యాదయ్య, నాగేందర్, జనార్ధన్, ప్రశాంత్, రాజశేఖర్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏబీవీపీ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన ఏబీవీపీ నూతన కార్యవర్గ సభ్యులు

ఎల్లారెడ్డి, మార్చి 20: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏబీవీపీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏబీవీపీ జిల్లా కన్వీనర్ చరణ్ ఖేల్, కన్వీనర్ రోహిత్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జశ్వ, కార్యదర్శిగా సమీర్, ఉపాధ్యక్షుడుగా వంశీ, శ్రీవన్య, వాసవిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ చరణ్ మాట్లాడుతూ ఒక విద్యార్థి అనే వాడు చదువుకుంటూ విద్యారంగ సమస్యలపై పోరాడాలని స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకుల స్టేట్ ఎగ్జిక్యూటివ్ కార్యకర్తలు శ్రావణి, సౌమ్య, పూజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

పసుపు బోర్డు ప్రకటనలకే పరిమితమైంది

- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ అర్బన్, మార్చి 20: అసెంబ్లీ ఎన్నికలకు ముందు జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రధాని మోదీ ప్రకటించిన అది కేవలం కాగితాలకే పరిమితమైందని ఇప్పటికి పసుపు బోర్డు ఎక్కడ ఏర్పాటు చేస్తారనే విషయంలో క్లారిటీ లేదని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి విమర్శించారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇప్పుడు మార్కెట్‌లో పసుపు ధర పెంపు వ్యాపారుల లబ్ధికోసమేనని దీనిని రైతులెవరూ నమ్మవద్దని ఆయన కోరారు. ప్రధాని హోదాలో మోదీ సైతం పసుపు ధర తమవల్లే పెరిగిందని చెప్పుకోవడం సిగ్గుచేటని పసుపు ధర పెరగడం వల్ల రైతులకు కొంత వరకు లాభం కలుగుతున్న మిగిలిన లాభం అంతా వ్యాపారులకే కలుగుతుందని ఆ వ్యాపారులంతా గుజరాత్ వారేనని ఆయన అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్ర పర్యటనలో ప్రధానిమోదీ పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటికి బోర్డు ఏర్పాటు విషయంపై స్పష్టత లేదని ఎక్కడ కూడా కార్యకలాపాలు మొదలు కాలేదన్నారు. గతంలో జిల్లాలో 85వేల ఎకరాలలో పసుపు సాగు అయ్యేదని ప్రస్తుతం అది తగ్గిందని సాగు విస్తీర్ణం తగ్గడం వల్లే ధర పెరిగిందని అందులో బీజేపీ చేసింది, ఎంపీ అరవింద్ చేసిన కృషి ఏమీ లేదన్నారు. తమవల్లే పసుపు ధర పెరిగిందని రైతులను మభ్యపెట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తుందన్నారు. రైతులు ఈ విషయంలో బీజేపీని నమ్మవద్దన్నారు. దేశంలో రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలని తెచ్చి వాటిని విమర్శల వల్ల వెనక్కితీసుకున్న ఏకైక ప్రభుత్వం బీజేపీ అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరిస్తారని గత ఐదేళ్లలో ఎంపీ అరవింద్ జిల్లాకు చేసిందేమి లేదన్నారు. మతాల మధ్య చిచ్చుపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించి ఎన్నికల్లో లబ్ధిపొందాలని బీజేపీ ప్రయత్నిస్తుందని తాహెర్‌బిన్ హుందాన్ అన్నారు. ప్రజల కోసమే కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుంది తప్ప ఎన్నికల కోసం కాదన్నారు. ఈ సమావేశంలో సీని యర్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి, తాహెర్‌బిన్ హుందాన్



మిషన్ భగీరథ వాటర్ ట్యాంకును శుభ్రం చేయిస్తున్న దృశ్యం

మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు శుభ్రం

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన అధికారులు

ఎల్లారెడ్డి, మార్చి 20:మండలంలోని కళ్యాణి గ్రామంలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులో మట్టి చెత్తాచెదారం అనే కథనాన్ని బుధవారం ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురించడంతో పంచాయతీ అధికారులు స్పందించి బుధవారం ట్యాంకులో ఉన్న మట్టి చెత్తాచెదారాన్ని శుభ్రం చేయించారు. శుభ్రం చేయడం పట్ల గ్రామస్థులు ఆనందం వ్యక్తంచేశారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అధికారులు ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని కోరారు.

నకిలీ విత్తనాలు అంటకట్టారని రైతుల ఆందోళన

బీర్కూర్, మార్చి 20: తమకు నకిలీ విత్తనాలు అంటకట్టారని ఆరోఎస్తూ బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన కొంత మంది రైతులు గ్రోమోర్ షాపులో ఆందోళన చేశారు. షాపు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన సుమారు మూడు వందల మంది రైతులు గ్రోమోర్ షాపులో గంగా కావేరి వరి విత్తనాలు కొనుగోలు చేసి పంటలు పండించారు. ప్రస్తుతం పంటలు కోతలు కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా మూడు వందల మంది రైతులు పొలాల్లో పంటలు కోతకు రాలేదు. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. గ్రోమోర్ వారు తమకు నకిలీ విత్తనాలు అండకట్టారని రైతులు ఆరోపించారు. అందరూ గ్రోమోర్ షాపుకు వెళ్లి సిబ్బందిని నిలదీశారు. గంగా కావేరికి బదులుగా ఇతర విత్తనాలు కట్టబెట్టారని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. 120 రోజుల్లో కోతలకు రావాల్సిన పంట 140 రోజులు గడిచినా రాలేదని రైతులు తెలిపారు. ఒక వేళ వడగళ్ళ వర్షం కురిసి పంట నష్టం వాటిల్లితే ఎలా అని ప్రశ్నించారు. తమ డీలర్‌లకు విషయం తెలియజేసి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో రైతులు తిరిగి వెళ్లిపోయారు.

కాయితీ లంబాడీల సమస్యలు పరిష్కరించాలి

పెద్దబజార్, మార్చి 20: కాయితీ లంబాడీల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని రాష్ట్ర బంజారా సమాజ్ సేవా సంఘం అధ్యక్షుడు తాన్‌సింగ్ నాయక్ అన్నారు. బుధవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1985 సంవత్సరం నుంచి ఉమ్మడి రాష్ట్రంలో ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో తమకు ప్రభుత్వాల వల్ల తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. కొన్ని సంవత్సరాలుగా లాభాన, లంబాడీలు, కాయితీ లంబాడీలు సాగు చేస్తున్న పోడుభూముల పట్టాలు ఇవ్వడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. గతంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రస్తుత సీఎంకి తమ సమస్యలను విన్నవించడం జరిగిందన్నారు. అప్పుడు ఆయన సానుకూలంగా స్పందించారని అన్నారు. సమస్యను పూర్తిగా పరిష్కరిస్తా నని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాయితీ లంబాడీలు సభ్యులు పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ సీట్ల దరఖాస్తుకు 23 వరకు గడువు

డిచ్‌పల్లి, మార్చి 20: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 6నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులకు ఈ నెల 23తో ముగుస్తు ందని జిల్లా సమన్వయకర్త సంగీత ఒక ప్రకటన లో తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రవే శ పరీక్ష ఏప్రిల్ 21న ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు స్టోసెటీ వెబ్‌సైట్ సంప్రదించలని సూచించారు.


గోదావరి నదిలో పడి యువకుడి ఆత్మహత్య

రెంజల్, మార్చి 20: మండలంలోని కందకుర్తి గోదావరి నదిలో పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎడపల్లి మండలం అంబం గ్రామానికి చెందిన బంద్రపల్లి పోశెట్టి(39)అనే వ్యక్తి గత వారం రోజుల క్రితం అప్పుల విషయంలో భార్యభర్తల మధ్య మనస్పార్థాలు రావడంతో భార్య పుట్టింటికి వెళ్లడంతో అప్పు ఎలా కట్టాలో బాధపడుతూ కుటుంబ సమస్యలతో కలత చెంది జీవితంపై విరక్తి చెంది కందకుర్తి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగిందని మృతుడి తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బాల్కొండలో రేయిలింగ్‌కు ఢీకొని వ్యక్తి మృతి

ముప్కాల్, మార్చి 20: ఉత్తరప్రదేశ్‌కు రోహిత్ కుమార్(25) బైక్‌పై హైదరాబాద్ నుంచి వారణాసి వెళ్తుండగా మార్గమధ్యంలో రేయిలింగ్‌కు ఢీకొని మృతి చెందిన ఘటన బాల్కొండ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన రోహిత్, సత్యేంద్రకుమార్‌పటేల్ జీవనోపాధి నిమిత్తం హైదరా బాద్‌లోని పని చేస్తున్నాడు. బుధవారం తెల్లవారు జామున హైదరాబాద్ నుంచి హోండా షైన్‌పై ఇద్దరు కలిసి వారణాసికి బయలుదేరి వెళ్లగా మార్గమధ్యంలో బాల్కొం డలోని శ్మశాన వాటిక వద్ద గల నేషనల్ హైవే 44వ వద్ద అతివేగంగా, అజా గ్రత్తగా నడిపి హైవే రోడ్డు పక్కన గల రేయిలింగ్‌కు బైక్ వెనుక కూర్చున్న రోహిత్ కుమార్ ముఖానికి బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని మామ మిక్సకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపి తెలిపారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

ప్రియా 35	- తంత్ర
దర్శన్	- రజాకర్
శాంతి	- ప్రేమలు
ప్రియా 70	- భీమా

బాన్సువాడ

వెంకటేశ్వర	- రజాకర్
మహేశ్వరి	- భీమా

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	200	220
వెనీకాబ్(కిలో)	:	120	210	230

